

# 'భావి' భామలు

**వసుంధర**

**పెళ్ళైన యువతి పెళ్ళికాని బావతో ప్రతి రోజూ కొన్ని గంటలు ఏకాంతంగా గడిపితే చిత్రం కాకపోవచ్చు. అందుకామె భర్త అభ్యంతరపెట్టకపోతే అదీ చిత్రం కాకపోవచ్చు. కానీ నేనీ వ్యవహారంలోంచి జీవితాదర్శాన్ని గ్రహించడముందే- అది మాత్రం చిత్రమే!**

నా నెలజీతం యాభైవేలు. ముప్పై ఐదు లక్షలు విలువచేసే నా ఐదుగదుల అపార్టుమెంట్లో ఉండేది పాతికేళ్ల నేను, ఇరవై రెండేళ్ళ నా భార్య ఊర్మిళ.

బేగంపేటలో 'లైఫ్‌స్టైల్'కి దగ్గర్లో ఉన్న మా ఇంట్లో ఎప్పుడు కుళాయి తిప్పినా మునిసిపల్ వాటర్. ఎప్పుడు స్విచ్ ఆన్ చేసినా నేనున్నానహో అనే కరెంట్. అడుగు బయటపెడితే చాలు, దర్శనమిచ్చే రకరకాల దుకాణాలూ, హోటళ్ళూ. అడుగు బయటపెట్టక్కర్లేకుండా గ్యారేజిలో ఓ శాంత్రో. నన్నూ నాభార్యనీ నా ఉద్యోగాన్ని మా ఇంటినీ కలిపిచూసిన వాళ్ళంతా నన్ను అదృష్టవంతుడంటారు. 'భావి' అనబడే మా బిల్డింగులో నా వయసు అదృష్టవంతులు మరో ఐదుగురున్నారు. ఇంకా ఎక్కువమంది ఉందామన్నా- మరి మా 'భావి'లో ఉన్నవి ఆరే అపార్టుమెంట్లు.

ఆర్నెల్లక్రితం బిల్డర్ మా అందరికీ ఒకేసారి ఇళ్ళు అప్పజెప్పినప్పుడు ఒకరికొకరు తెలిసి- పొరుగు మహచక్కదని మహదానందపడ్డాం. ఇళ్ళు బాగా కట్టాడని బిల్డర్ని పొగిడితే, ''అర్హతకు తగిన గౌరవాన్ని కాదనకూడదు.'' అంటూ బిల్డర్ మా పొగడ్తలను నిర్మొహమాటంగా స్వీకరించి, ''చాలామంది బిల్డర్సు ఇళ్ళు కట్టడంతో తమ పని అయిపోయిందనుకుంటారు. కానీ మీకు డబ్బున్నా, నా అనుభవం లేదు. చదువున్నా, నా లోకజ్ఞానం లేదు. ఉద్యోగమున్నా, నా స్వేచ్ఛ లేదు. అదృష్టమున్నా నా పలుకుబడి లేదు. అందుకని ఇళ్ళప్పగించేసినా కూడా మీకు నేను సాయపడుతూనే ఉంటాను.'' అంటూ మమ్మల్ని కొంత చిన్నబుచ్చి- కొంత పరబిల్డర్ నింద చేసాడు. ఆ తర్వాత కిమ్మనకుండా తన మాటలు వింటున్నామనేమో, ''మీరో అసోసియేషన్ ప్రారంభించండి. మీ లీడరు ద్వారా మీ సమస్యలు తెలియజేస్తే నేను పరిష్కారాలు చెబుతూంటాను.'' అని ఓ సలహాను హామీలా ఇచ్చి వెళ్ళిపోయాడు.

అలా శివ మాకు లీడరై- ఆ వెంటనే 'భావి' భామలకు- ఒంటరితనమొక పెద్ద సమస్యని గుర్తించాడు. మేమంతా వెళ్ళేది తలో కంపెనీకే అయినా- అంతా ఉదయం ఏడున్నరకల్లా ఇల్లు వదిలి- మళ్ళీ రాత్రి ఎనిమిదింటికి ఇల్లు చేరతాం. అంతసేపూ అందం, వయసు ఉన్న 'భావి' భామలకు ఒంటరితనం. నా విషయమే తీసుకుంటే- ఆఫీసునుంచి అలసి వచ్చిన నాకూ, ఒంటరితనంతో విసిగి

పోయిన ఊర్మిళకూ పొంతన కుదరక ఇద్దరిలోనూ అసహనం, దాన్నించి పుట్టుకొచ్చి అసంతృప్తీ మోతాదు మించిపోయాయి. కొత్త మోజూ, కొత్త కాపురమే ఇలా ఉంటే ముందు సంగతేమిటని భయమేసింది నాకు.

ఊర్మిళకు రోజంతా టీవీ చూడ్డం బోరు. సంగీతం, సాహిత్యం, పై చదువులు –కూడా బోరనిపించి ఇరుగు పొరుగులతో కాలక్షేపం చేయాలనుకుంది. ఐతే తను చిరునవ్వితే ఒకామె మొహమదోలా పెట్టింది. ఒకామె పనుందని సారీ చెప్పింది. ఒకామె ముళ్ళమీదున్నట్లు అసహనంగా ఉంది. ఒకామె బాగా రెస్పాండయినా ఊర్మిళకే ముళ్ళమీదున్నట్లనిపించింది. మరి ఒకామె కంటికే కనిపించదు.

''ఐతే నువ్వూ ఏదైనా ఉద్యోగంలో చేరు.'' అంటే– ''మీరంటే బోరు కొడితే, అప్పుడు'' అంది ఊర్మిళ. అది సమాధానం కాదు. తనుద్యోగం చేస్తే నేనేం పోగొట్టుకోవాల్సుంటుందో హెచ్చరిక.

నా ఈడువాడైన శివకేం చెబుతాన్లే అని ఓ శనివారం మధ్యాహ్నం – ఊర్మిళ నిద్రలో ఉండగా– నా ఈడువాడు కాని బిల్డర్ని కలిసి సమస్య చెప్పగా, ''కొత్త మురిపెం పొద్దెరగదన్న సామెతను చట్టుబండలు చేసావు కదయ్యా! నువ్వేమో రోజంతా ఆఫీసులో తడిపేసి నీరసంగా ఇంటికొస్తావు. మొగుడితో ముచ్చట్లు తప్ప ఇంకేం ఇష్టపడని కొత్త పెళ్ళాన్ని– పుస్తకాలు చదువు, టీవీ చూడు– అంటావు. ఆ అమ్మాయికెలా ఉంటుంది? చెప్పేదేదో రొమాంటిక్‌గా చెప్పాలి.'' అన్నాడాయన నన్ను మందలిస్తూ. అప్పుడు నేను బిడియం విడిచి, ''రోజులో ఎక్కువ టైము కలిసిలేమన్న బాధ తప్పితే – కలిసున్నప్పుడు మేము చాలా రొమాంటిక్‌గా ఉంటాం.'' అన్నాను. ఆయన ఇంప్రెసైనట్లులేదు, ''రొమాన్సూ సెక్సూ ఒకటి కాదు. సెక్సు శారీరక అవసరం. రొమాన్సో గొప్ప అనుభూతి. అవసరానికి– డబ్బుతోనే కాదు, సెక్సుతోనూ ఆదుకునే మనుషులుంటారు. కాబట్టి స్నేహమున్న స్త్రీపురుషుల మధ్య కూడా సెక్సు సంబంధాలుండొచ్చు. రొమాన్సు మాత్రం ప్రేమికులకూ, దంపతులకూ మాత్రమే పరిమితం.'' అన్నాడాయన.

ఆయన ఆంతర్యం గ్రహించలేక, ''చెప్పేదేదో సూటిగా చెప్పు.'' అన్నాను.

''అవున్లే– నువ్వు మరీ కుర్రాడివి. మానవ మనస్తత్వాన్ని కాచి వడబోసిన నా మాటలు కాస్త సూటిగా చెబితే తప్ప నీకర్థం కావులే.'' అంటూ నవ్వి, ''నీ భార్యకు సలహాలివ్వడం మానేసేయ్. నువ్వామెనెంతగా మిస్సౌతున్నదీ చెప్పి, ఆమెను అదేపనిగా పొగుడు'' అన్నాడు బిల్డర్.

''అవన్నీ చేసాకే నీ దగ్గరకొచ్చాను'' అన్నాను కాస్త విసుగ్గా. అప్పుడాయన సాలోచనగా, ''ఆడవాళ్ళకు సాటివారిలో సాటిలేనివారనిపించుకోవాలని ఉండడంవల్లే– చీరలు, నగలు, సౌందర్యసాధనాలు వగైరాలపై మోజు. పెళ్ళైన కొత్తలో భర్తపై మోజుతో– మరుగునపడ్డ ఆ సరదాలని– సాటి ఆడదే పునరుద్ధరించగలదు. మన 'భావి'లో ఆడవాళ్ళందర్నీ తరచుగా ఒకచోట కలిపితే వాళ్ళు రెచ్చిపోయి షాపింగు చేస్తారు. వాళ్ళ షాపింగుకు ఎంత ఎక్కువ సహకరిస్తే– భర్త అంత ఎక్కువ రొమాంటిక్ అన్నమాట! అంతే– రొమాన్సు ఒక్కసారిగా మాటల్నించి డబ్బుకి మారిపోతుంది!'' అన్నాడాయన.

''డబ్బు ఖర్చుకి నేను రెడీ. కానీ 'భావి' భామలను తరచుగా ఒకచోట కలిపేదెలా?'' అన్నాను.

''సెలవురోజుల్లో సకుటుంబంగా కలవండి. క్రమంగా ఆడవాళ్ళంతా దగ్గరౌతారు. ఆ తర్వాత వాళ్ళను విడదీయడమే పెద్దసమస్య. ఎందుకంటే అబ్బాయిలూ, అబ్బాయిలూ కలిసినంత తొందరగా అమ్మాయిలు అమ్మాయిలతో కలవరు. కలిసాక– అమ్మాయిల మధ్య ఉండే ఆ చనువే వేరు. ఈ ఉపాయం ముందు శివకీ తర్వాత 'భావి' లో అందరికీ చెప్పాను. నువ్వు ఆఖరు వాడివి. శివ ఈ రోజు 'భావి'లో టెర్రేస్ మీద మీటింగు కూడా పెడతానన్నాడు.'' అన్నాడు బిల్డర్.

నేను తెల్లబోయి, ''చెప్పిందే అందరికీ మళ్ళీ మళ్ళీ చెప్పడమెందుకూ? శివకు చెప్పానని ఒక్క మాటంటే సరిపోయేది కదా!'' అన్నాను.

''మీరుమాత్రం ఒకొక్కరే నా దగ్గరకొచ్చే బదులు శివను పంపొచ్చుగా– మీ అహం మీది. మరి సాయంత్రం మీటింగులో శివ నాకు క్రెడిటివ్వడేమోనని నా జాగ్రత్త నేను పడ్డాను. నా అహం నాది.'' అన్నాడు బిల్డర్.

సాయంత్రం శివ ఆధ్వర్యంలో– 'భావి' టెర్రేస్ మీద 'భావి' భర్తలం మీటయ్యాం. ముందుగా శివ– తెలుసు మొర్రో అని మేం గోలపెట్టినా వినకుండా స్త్రీపురుషుల మనస్తత్త్వాల్లో భేదాలు వివరించి, సమస్య, పరిష్కారమార్గం చెప్పాడు.

ఎక్కడ ప్రజాస్వామ్యముంటుందో అక్కడ నాయకులతో పాటు అనుచరులూ, ప్రతిపక్షమూ ఉండడం సహజం. మేము అనుచరుల్లా శివను సమర్థిస్తే– నరేంద్ర ప్రతిపక్షమై, ''సమస్య నా భార్యది. పరిష్కారానికి సంబంధించిన నిర్ణయమూ ఆమెదే. కాబట్టి నాకోరోజు గడువు కావాలి'' అన్నాడు.

ఇది ఊర్మిళకు తెలిస్తే నన్ను నరేంద్రతో పోల్చి దుయ్యబట్టడం ఖాయం. భార్య గురించి ఇలా ఆలోచించాలని తోచనందుకు శివతోసహా మేమైదుగురం తడబడి నరేంద్ర మాటకు సరేనన్నాం.

ఆ రాత్రి ఊర్మిళకు జరిగింది కాస్త మార్చి, ''శివ ప్రతిపాదనకి ప్రతివాడూ గంగిరెద్దులా తలూపేసాడు. ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది పెళ్ళామని నేను చెప్పేదాకా ఒక్కడికీ స్ఫురించలేదు.'' అంటూ నరేంద్ర క్రెడిట్‌ని కాజేసాను. 'అశ్వత్థామ హతః' అన్న సగం అబద్ధంతోనే ధర్మరాజుకి కురుసామ్రాజ్యం దక్కింది. సగం అబద్ధంతో నేనా రాత్రి మదన సామ్రాజ్యాధినేతనయ్యాను.

''రొమాన్సూ సెక్సూ ఒకటి కాదు. సెక్సు శారీరక అవసరం. రొమాన్సో గొప్ప అనుభూతి. అవసరానికి– డబ్బుతోనే కాదు, సెక్సుతోనూ ఆదుకునే మనుషులుంటారు. కాబట్టి స్నేహమున్న స్త్రీపురుషుల మధ్య కూడా సెక్సు సంబంధాలుండొచ్చు. రొమాన్సు మాత్రం ప్రేమికులకూ, దంపతులకూ మాత్రమే పరిమితం.''

మర్నాడు మీటింగులో నరేంద్ర తప్ప మిగతా వాళ్ళంతా కూడా అదే సామ్రాజ్యాధినేతల్లా కనిపించారు నాకు. నరేంద్రమాత్రం ప్రతిపక్షం వదలక, ''ఆఫీసురోజుల్లో మనసువిప్పి మాట్లాడుకునే టైమెలాగూ లేదు. కనీసం సెలవప్పుడైనా ఏకాంతంగా గడుపుదాం– అంటోంది నా భార్య చిత్ర.'' అన్నాడు.

శివ ముఖం ఎర్రబడింది. ''మాన్ ఈజ్ సోషల్ యానిమల్. ఇఫ్ హి ఈజ్ నాట్ సోషల్– హి ఈజ్ ఓన్లీ యాన్ యానిమల్'' అన్నాడు కాస్త కోపంగా.

''ఐతే మనం 'భావి'లో బదులు ఏ రవీంద్రభారతిలోనో కలుద్దాం. అక్కడ వేలకొద్దీ జనముంటారు. బోలెడు సోషల్‌గా ఉండొచ్చు.'' అన్నాడు నరేంద్ర– వ్యంగ్యానికి శాంతాన్ని పులిమి.

''ఏం– సోషల్ గాదరింగుకి 'భావి'లో పన్నెండుగురు చాలరా?'' అన్నాడు శివ వ్యంగ్యంగా.

''పన్నెండుగురెందుకూ – ఇద్దరే చాలంటేనే కదా నీకు కోపమొచ్చింది!'' అన్నాడు నరేంద్ర.

గట్టివాడే– అనుకున్నాను. శివ కాస్త తగ్గి, ''ఓ బిల్డింగులో ఉంటున్నప్పుడు అంతా ఓ తాటిమీద నడిస్తే బాగుంటుందని అలా అన్నాను. నీ కిష్టం లేకపోతే బలవంతమేం లేదు.'' అన్నాడు.


''సామూహిక ప్రయోజనంకోసం నేనూ మీతోపాటు ఒకతాటిమీదే నడుస్తాను. వ్యక్తిగత జీవితంలో మాత్రం ఎవరితాడు వారిది.'' అన్నాడు నరేంద్ర.

''ఐతే నువ్వికవెళ్ళొచ్చు.'' అన్నాడు శివ అసహనంగా. నరేంద్ర వెళ్ళాక మేమంతా అతణ్ణి కాసేపు కసితీరా తిట్టుకున్నాం. ఆడవాళ్ళు పోటీపడి షాపింగుచేస్తే డబ్బు ఖర్చని భయపడ్డాడనీ, భార్య మీద నమ్మకం లేక ఆమెను మాకు దూరంగా ఉంచాలనుకుంటున్నాడనీ నిర్ణయించాం. 'భావి' భామలందరిలోకీ చిత్రే ఎక్కువ అందగత్తె అని లోపాయికారీగానూ, నరేంద్రకంటే అందగాళ్ళమని ఎవరికివాళ్ళమూ అనుకునే మా అహానికి రెండో కారణమే ఎక్కువ తృప్తినిచ్చింది. అప్పుడు మేము మా సెలవురోజు మీటింగులు ఆడవాళ్ళను ఒంటరితనం బారినుంచి రక్షించడానికని మర్చిపోయి– సెలవురోజుల్లో మా పార్టీలు నరేంద్ర అసూయ పడేటంతగా అదిరిపోవాలనీ, చిత్ర అతడిమీద విప్లవశంఖం పూరించాలనీ, మా ఆడవాళ్ళకు శివ మీదా, చిత్రమీదా ఏవగింపు పుట్టించాలనీ నిర్ణయించాం. అందుకు నేనారాత్రే శ్రీకారం చుట్టి ఊర్మిళముందు నరేంద్రనో పురుషాహంకారిగా చిత్రించాను. ఆమె ఆవేశపడి ''కలుస్తామన్నా

నరేంద్రనూ, చిత్రనూ మనతో కలుపుకోవద్దు'' అంది.

అప్పట్నించి సెలవురోజుల్లో 'భావి'లో మా ఐదు కుటుంబాలూ ఒక్కటయ్యాయి. ఒకోరోజు ఒకో ఇంట్లో సమావేశం. మగువలంతా ఓ జట్టు. మగాళ్ళంతా ఓ జట్టు. కబుర్లే ఇంధనమై ఇచ్చిన ఉత్సాహంతో మహిళలు వంటలు చేస్తే - మేము కబుర్లాడుతూ ఉద్రేకంగా పేకాడేవాళ్ళం. కలిసి విందు. చివర్లో తంబోలా.

ఒకోసారి 'భావి' బయట- ఇందిరా పార్కుకో, ఎన్టీ ఆర్ గార్డెన్సుకో, టాంక్‌బండుకో, రామోజీ ఫిల్మ్‌సిటీకో పిక్నిక్కి వెళ్ళి - అదే తరహాలో ఎంజాయ్ చేసేవాళ్ళం. ఖర్చుకు తడుముకునే వాళ్ళం కాదు. పేకాట, సినిమాలు, షాపింగు వగైరాలు 'భావి' భామలకిచ్చిన కొత్త ఉత్సాహం - నాకు ఊర్మిళను చూస్తేనే స్పష్టమౌతోంది. ఫిర్యాదులు, నస లోపించడంతో- నాకిప్పుడు ప్రతిరాత్రి




వసంతరాత్రి, ప్రతిగాలి పైరగాలి.

ఆర్నెల్లు గడిచినా నరేంద్రకు మాపై అసూయ పుట్టలేదు. చిత్ర మావాళ్ళను కలుసుకోలేదు. ఉండబట్టులేక మావాళ్ళే వెళ్ళి చిత్రను అడిగితే, ''నాకు కబుర్లు నచ్చవు. షాపింగు సరదా లేదు. చిన్నప్పుడు కూడా ఎవరితోనూ కలిసేదాన్ని కాదని - ఒంటిపిల్లి రాకాసి అనేది మా అమ్మ'' అనేసి వదుల్చుకుంది. అది తెలిసి మేమూ ఉండబట్టలేక ఒకసారి నరేంద్రను కలుసుకుని - మారుతున్న సొసైటీకి ఎక్స్‌పోజ్ కాకపోతే ముమ్ముందు చిత్ర చాలా ఇబ్బంది పడుతుందని హెచ్చరించాం. బదులుగా, ''కాస్మెటిక్సు, ఫాస్ట్‌ఫుడ్సులాంటివైతే - సొసైటీలో వచ్చే మార్పులకి ఎక్స్‌పోజ్ కాకపోవడమే మంచిది. సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, సినిమాలు, రాజకీయాలు వగైరాలను శ్రద్ధగా అధ్యయనం చేసే మా చిత్ర అభిరుచులు- వనమూలికలు, ఇంటిభోజనంలా ఎప్పటికీ నిత్యనూతనం. నేనామెలో మార్పుకోరడం లేదు.'' అన్నాడు నరేంద్ర.

ఇది ఊర్మిళకు చెప్పి వేళాకోళంగా నవ్వితే- ఎందుకో ఊర్మిళ నవ్వలేదు. ఆ తర్వాతనుంచి తన ప్రవర్తనలోనూ మార్పొచ్చింది. షాపింగు తగ్గించి పుస్తకాలు చదవడం, పాటలు వినడం మొదలెట్టింది. మంచిదేగా అనుకున్నాను కానీ - నేనొక రోజు రాత్రి ఇంటికొచ్చి - స్నానం చేసాక తనను దగ్గరగా తీసుకోబోతే, ''కాసేపు మంచి కబుర్లు చెప్పుకుందాం'' అంది.

మంచి కబుర్లంటే సాహిత్యంలో పాత్రలు, పాటల్లో విశిష్టత అని తెలుసుకుని, ''నువ్వు చెప్పేవి మనసుకు సంబంధించినవి. ఇప్పటికి వయసుకు తగ్గట్లుందాం.'' అంటూ ఆమెను సున్నితంగా మందలించబోయాను.

''మనసు మంచిది. వయసు చెడ్డది- అన్నారో కవి ఓ సినిమా పాటలో'' అంది ఊర్మిళ వెంటనే.

''ఐతే వయసులో ఉన్నవాళ్ళు పెళ్ళి చేసుకోకూడదా?'' అన్నాను వ్యగ్యంగా.

''పోనీ- ఇంకోలా చెబుతాను. మనసు శృంగారం. వయసు పోర్నోగ్రఫీ.'' అంది ఊర్మిళ.

నిజం చెప్పొద్దూ నాకు రెంటికీ తేడా తెలియదు. అందుకని, ''అంటే?'' అన్నాను.

''ఇంటికొస్తూనే ఆబగా కౌగిలించుకోవడం వేరు. కళ్ళలో ప్రేమను కురిపిస్తూ - ''నీవుకాక వేరెవరైనా నవ్వలేరు వెన్నెలలాగా' అనో, 'ఆ కురులు ఇంద్రనీలాల వనులు..' అనో, 'చెలి గుండియలో రగిలే వగలే చలిమంటలు' అనో- కవిత్వం చెబుతూ సున్నితంగా దగ్గర కావడం వేరు. వయసులోని చెడ్డతనానికి మనసుకన్న మంచితనాన్ని రంగరిస్తే అది శృంగారం'' అంది ఊర్మిళ.

''ప్లీజ్- శృంగారానిక్కూడా సిలబస్ పెట్టి పెళ్ళిని డిగ్రీ కోర్సుగా మార్చకు.'' అంటూ ఆమె పెదాలను నా పెదాలతో మూసాను. ఆమెదీ వయసే. అదీ చెడ్డదే. అందుకని ఆ క్షణంలో నాకు సహకరించకుండా ఉండలేకపోయింది.

ఊర్మిళలోని మార్పు ఆమెకే పరిమితం కాదని గ్రహించాక - చిత్రను ప్రభావితం చేయడానికి బదులు ఆ ఐదుగురాడవాళ్ళూ తామే ఆమె ప్రభావానికి లోను కావడం మాకందరికీ చిత్రంగా అనిపించింది. అయితేనేం- అభిరుచిపరంగా సంగీత సాహిత్యాలను తప్పు పట్టడానికేం లేదు కదా అని అప్పటికి సరిపెట్టుకున్నాం. కానీ కొద్ది రోజులకే చిత్ర గురించి మేము భయపడాల్సిన ఓ భయంకర రహస్యం బయటపడింది.

ఆరోజు ఆఫీసు పనిమీద నా బాస్‌తో కలిసి కార్లో ఊళ్ళోకొచ్చాను. పనిపూర్తయ్యేసరికి సాయంత్రం అయిదున్నరయింది. ఇక ఆఫీసుకి వెళ్ళే పనిలేదని బాస్ నన్ను 'భావి' దగ్గర దింపి వెళ్ళాడు.

అక్కడ నాకు బిల్డర్ కనిపించాడు ఓ అపరిచితుడితో మాట్లాడుతూ. నన్ను చూస్తూనే చిన్నగా నవ్వి, ''ఇతడు సారంగ్. అబిడ్సులో పెద్ద నగల షాపు ఓనర్?'' అంటూ ఆ అపరిచితుణ్ణి పరిచయం చేసాడు. నేను చేయి చాపితే సారంగ్ నాకు షేక్ హాండిచ్చి, ''మీ బిల్డర్‌ది బిజినెస్ మైండు. అందుకే నన్ను షాపు ఓనరుగా పరిచయం చేసాడు. కానీ మీరు నన్ను చిత్ర బావగా గుర్తుంచుకోవచ్చు. చిత్ర అంటే మీకు తెలియదేమో- మీ 'భావి'లో నరేంద్ర భార్య'' అనేసి వెళ్ళిపోయాడు.

''అతడితో నీకెలా పరిచయం?'' ఆశ్చర్యంగా అడిగాను బిల్డర్ని.

బిల్డర్ అదోలా నవ్వి, ''మన 'భావి'కి రోజూ వస్తాడు. అతడు నాకు తెలియకేం?'' అంటూ నర్మగర్భంగా నవ్వాడు. అతణ్ణి దువ్వితే అప్పుడు బయటపడ్డ విశేషాలు నేనూహించనివి.

వర్కింగ్‌డేస్‌లో సారంగ్ రోజూ ఇక్కడికొచ్చి ఒంటిగంటన్నరనుంచి ఐదున్నరదాకా చిత్రతో గడిపి వెడతాడు. లోపలేం జరుగుతుందో కానీ- చిత్ర అతణ్ణి సాగనంపడానికి గుమ్మందాకా కూడా రాదు.

''ఇదంతా రంగ్ ఇక్కడికి రాడని మాత్రం నాకు తెలుసు.''

''మరి ఇంతకాలం ఈ విషయం నాకెందుకు చెప్పలేదు?'' నిష్ఠూరంగా అడిగాను.

''బిల్డింగెలాగుందో చూసిపోదామని అడపాతడపా వచ్చే నాకే చాలాసార్లు తగిలిన సారంగ్‌ని- మీ ఆడవాళ్ళూ చూసే ఉంటారు కాబట్టి ఈపాటికి నీకు తెలిసే ఉంటుందనుకున్నాను.'' అన్నాడాయన. ఇలాంటి విషయం తెలిస్తే ఊర్మిళ నాకు చెప్పకుండా దాచదు. బిల్డర్‌తో వాదనెందుకని- వెంటనే మా ఇంటికెళ్ళి కాలింగ్‌బెల్ మోగించాను. తలుపు తెరిచిన ఊర్మిళ నన్ను చూస్తూనే ఆశ్చర్యపడి, ''మీరా?'' అని పక్కకు తప్పుకుంది. నేను లోపలకెళ్ళి తలుపు మూసాక గమనిస్తే - ఆమె చేతిలో 'అదృష్టం' అనే కథాసంపుటి కనబడుతోంది. గదిలో 'మదిలో వేదన ఏదో కదలె రాధకూ' అంటూ సీడీ వినబడుతోంది.

''పుస్తకం చిత్ర ఇచ్చింది. చలంగారి కథలు. గత శతాబ్దంలోనే ఆడవాళ్ళ గురించి ఇంత గొప్పగా ఆలోచించిన రచయితలున్నారని నాకు తెలియదు.'' అంది ఊర్మిళ.

నేను ఉలిక్కిపడి, ''చలం పేరు తెలుసు. లేచిపోయిన ఆడాళ్ళను సమర్థిస్తాడనీ, సెక్సులో అక్రమ సంబంధాలను ప్రబోధిస్తాడనీ- ఆయన కథలు మా ఇంట్లో చదవనిచ్చేవారు కాదు'' అన్నాను.

''నిజం తెలుసుకుందుకు ఈరోజు మనిద్దరం కలిసి ఒక్క కథ చదువుదాం'' అభ్యర్థించింది ఊర్మిళ.

''ఇప్పుడు నేను నీకు అర్జంటుగా ఓ కొత్తకథ చెప్పాలి.'' అంటూ నేను సారంగ్ వివరాలు చెప్పాను. ఊర్మిళ నిరుత్సాహపడి, ''కొత్త కథంటే ఇంకా ఏమో చెబుతారనుకున్నాను. మీరు చెప్పింది 'భావి'లో మా అందరికీ చాలాకాలంగా తెలుసు.'' అంది.

అంటే బిల్డర్ అన్నదే నిజం. ''నీకేం తెలుసో చెప్పు'' అన్నాను ఆశ్చర్యంగా.

బిల్డర్ చెప్పిందే తనూ చెప్పి, ''సారంగ్, చిత్ర గాఢంగా ప్రేమించుకున్నారు. ఉన్నట్లుండి రెండు కుటుంబాలమధ్యా పచ్చగడ్డేస్తే భగ్గుమనేలా చెడిపోయింది. పెద్దలనెదిరించడం ఇష్టపడని చిత్రకు నరేంద్రతో పెళ్ళైంది. తానిక పెళ్ళే చేసుకోనన్న సారంగ్- ఇప్పుడు రోజూ చిత్రను కలుసుకుని నాలుగైదు గంటలు గడిపి వెడుతూంటాడు. నరేంద్రకీ విషయం తెలుసంటుంది చిత్ర. సారంగ్, చిత్రల అభిరుచులు ఒక్కటేనట. రోజూ సారంగ్‌తో కాసేపు గడిపితే ఆమె ఎంతో ఫ్రెష్‌గా ఫీలై భర్తతో ఎంతో ప్లెజెంట్‌గా ఉంటుందిట. అందుకని వాళ్ళు కలుసుకోవడాన్ని నరేంద్రే ఎంకరేజ్ చేస్తాడట.'' అంది ఊర్మిళ.

''నమ్మడం కష్టం. అదే నిజమైతే సారంగ్ నరేంద్ర ఉన్నప్పుడే రావచ్చుగా?'' అన్నాను.

''రావచ్చు కానీ నరేంద్ర అభిరుచులు వేరు. సారంగ్‌తో కాసేపు గడపకపోతే, నరేంద్ర అభిరుచుల్ని చిత్ర కూడా భరించలేదు. అందుకని వాళ్ళిలా ఏర్పాటు చేసుకున్నారు.''

ఈ వ్యవహారానికి ఊర్మిళ స్పందిస్తున్న తీరు నాకు నచ్చలేదు. ''తనకూ సారంగ్‌కీ ఉన్న అక్రమ సంబంధానికి భర్త ఆమోదముద్ర ఉందంటుంది చిత్ర. నువ్వు నమ్మావా?'' అన్నాను చిరాగ్గా.

''నేను అభిరుచులను పంచుకోవడం గురించి చెబితే మీరు అక్రమసంబంధమంటారేమిటి?'' అంది ఊర్మిళ నాకంటే చిరాగ్గా. ''నీ వెచ్చని నీడా నిలిచెను నా వలపుల మేడా'' పాడుతోంది సీడీ.

''వరస కుదిరి, ఏకాంతం దొరికితే- మనసు మంచిదైనా వయసు చెడ్డదే కదా!'' అన్నాను.

''కళ్ళతో నేనేం చూడలేదు కాబట్టి చెవులకు వినపడ్డ చిత్ర మాటలు నమ్మాను.'' నిర్లక్ష్యంగా అంది ఊర్మిళ.

''మన 'భావి'లో ఇలాంటి భాగోతం జరుగుతోందని తెలిసాక ముందు మీ ఆడాళ్ళే పూనుకుని వాళ్ళిద్దరికీ గట్టిగా బుద్ధి చెప్పాలి. అలాంటిది నువ్వు వాళ్ళను సమర్థిస్తున్నావా?'' మందలించాను.

''ఐశ్వర్యను సల్మాన్ ప్రియురాలన్నారు. తర్వాత వివేక్ ప్రియురాలన్నారు. ఇప్పుడామె అభిషేక్‌ని పెళ్ళిచేసుకుంది. ఐనా అభిమానుల్లో ఒక్కరైనా ఐశ్వర్యకు కానీ ఆమె ప్రియులకు కానీ బుద్ధి చెప్పాలనుకున్నారా? ఆమెకో న్యాయమూ- చిత్రకో న్యాయమూనా?'' వెంటనే నిలదీసింది ఊర్మిళ.

''అదేం పోలిక? చిత్రకు పెళ్ళయింది. ఐశ్వర్యకు పెళ్ళి కాలేదు.'' అన్నాను చిరాగ్గా.

''పోనీ- పెళ్ళైన హేమమాలిని- భర్త అనుమతితో నటిగా కొనసాగుతూ తెరమీద ఎందరు హీరోలతోనే క్లోజ్‌గా నటించింది. అలాగే రాఖీ గుల్జార్. ఇంకా ఇప్పుడు కాజోల్. మాధురి కూడా నటిస్తుందంటున్నారు. వాళ్ళనెవరైనా తప్పు పడుతున్నారా? ఇదీ అంతేననుకుని ఊరుకోవచ్చుగా.''


ఏమనాలో తెలియక, ''వాళ్ళు తారలు. వారి నటనకు ముగ్ధులైన అభిమానులు వాళ్ళను దేనికీ తప్పు పట్టాలనుకోరు. కానీ సారంగ్, చిత్రలు మామూలు మనుషులు.'' అన్నాను.

'ఏదీ ఆ యమున? యమున హృదయమున గీతికా?' అంటూ సీడీలో పాట నన్నే ప్రశ్నిస్తున్నట్లుంది.

తమాయించుకున్నాక, ''నువ్వన్నది రైటే. చిత్రలో ఉన్నది మీలో లేకపోవడం అందుక్కారణం కావచ్చునని నీకనిపించలేదా?'' అంటూ నేనూ ఎదురుదాడి చేసాను.

ఊర్మిళ తడుముకోలేదు, ''అందుకేగా మేము చిత్రకు వీరాభిమానులమయ్యాం. ఇంకా చెప్పాలంటే మేము నరేంద్ర సంస్కారానిక్కూడా వీరాభిమానులం. చిత్రను చూసి ఉత్తమాభిరుచులను అలవర్చుకుంటూ- సారంగ్ వంటి ప్రియుడి సాంగత్యం కోసం కలలు కంటున్నాం. మా భర్తలకు సారంగ్‌వంటి కళా హృదయమో, నరేంద్రవంటి సంస్కారమో ఇవ్వమని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాం?''

దాంపత్యజీవితానికి నిర్వచనంలా ఉన్న ఆ




''వాళ్ళు మామూలు మనుషులా? 'భావి'లో నా అంతటి ఐదుగురాడవాళ్ళు వాళ్ళకు వీరాభిమానులు?'' అని వెంటనే ఊర్మిళ అంటే ఉక్రోషపడి, ''సమాజం ఎంతగా దిగజారిపోయింది? చెడిపోయిన వాళ్ళకు అభిమానులా? అదీ లేడీ ఫాన్స్.'' అన్నాను.

''వాళ్ళు చెడిపోయారని మాకు తెలియదు. కానీ నగల వ్యాపారం చేసే సారంగ్- ప్రియురాలితో ఏకాంతంకోసం ప్రతిరోజూ నాలుగు గంటలు స్పేర్ చేస్తున్నాడు. వర్కింగ్ డేస్‌లో రొమాన్సును మంచానికి పరిమితం చేసి- సెలవురోజొస్తే చాలు భార్యలతో ఏకాంతానికి బదులు స్నేహితులతో పేకాటకై ఎగబడే మీలాంటి మగాళ్ళను చూసాక అతడికి వీరాభిమానులం కాకుండా ఉండగలమా?'' అంది ఊర్మిళ.

ఈ ఎదురుదాడి నేనూహించలేదేమో షాక్ తిన్నాను. తేరుకుందుకు కాసేపట్టింది. ఈలోగా మాటల్లో సగటు ఇల్లాలి ఆవేదన ధ్వనిస్తోంది. ఉన్నట్లుండి- ''రొమాన్సూ సెక్సూ ఒకటి కాదు. సెక్సు శారీరక అవసరం. రొమాన్సో గొప్ప అనుభూతి. అవసరానికి- డబ్బుతోనేకాదు, సెక్సుతోనూ ఆదుకునే మనుషులుంటారు. కాబట్టి స్నేహమున్న స్త్రీ పురుషుల మధ్య కూడా సెక్సు సంబంధాలుండొచ్చు. రొమాన్సు మాత్రం ప్రేమికులకూ, దంపతులకూ మాత్రమే పరిమితం.'' అన్న బిల్డర్ మాటలు గుర్తొచ్చాయి.

నా కళ్ళు తెరుచుకున్నాయి. చటుక్కున ఊర్మిళ చేతినుంచి 'అదృష్టం' అందుకుని, ''పద- ఇద్దరం కలిసి చదువుకుందాం.'' అన్నాను.

'అడిగడిగో అల్లడిగో అభినవ నారీ మన్మథుడు' సీడీలో కొత్తపాట మొదలైంది.

అప్పుడే నా మనసు 'భావి' భామలను దాటి భావి భామల గురించి ఆలోచించడం మొదలైంది.

★